'ఉపాధి హామీ చట్టానికి కాంట్రాక్టు పద్ధతి వ్యతిరేకం'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాంట్రాక్టు పద్ధతుల్లో పనులు చేపట్టడం ఉపాధి హామీ చట్టానికి పూర్తి వ్యతిరేకమని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు దీనిపై కేంద్ర ప్రభుత్వానికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో పంచాయతీ, పరిషత్తుల ద్వారా పనులు చేయాలన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో కాంట్రాక్టర్లకు నిధులు అప్పగించి, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పంచాయతీ రాజ్ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ నిధులను దుర్వినియోగం చేస్తూ గ్రామాల్లో కాంట్రాక్టు పనులు చేస్తున్న వారిని సర్పంచులు, ఎంపిటిసిలు ప్రజా కోర్టులో దోషులుగా నిలబెట్టాలని కోరారు. ఈ పనులకు సహకరిస్తూ కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాంట్రాక్టర్లకు ఇచ్చిన బిల్లుల నిధులు అధికారుల నుంచి రాబడతామని తెలిపారు.

'ఫెంగల్' గుబులు

- జిల్లా వ్యాప్తంగా తేలికపాటి జల్లులు
- పొలాల్లో కోసిన వరిచేను
- కళ్లాల్లోనే ధాన్యం • ఆందోళనలో రైతులు

ఓవైపు కోసిన వరిచేనంతా పంట పొలాల్లోనే ఉంది. నూర్పిడి చేసిన ధాన్యం కళ్లాల్లోనే ఉన్నాయి. మరోవైపు భారీ వర్షాలుంటూ వాతావరణ శాఖ, జిల్లా అధికారుల హెచ్చరికలు... అందుకనుగుణంగానే శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఏడాది కష్టమంతా వర్షార్పణమైపోతుందన్న భయంతో పంటను కాపాడుకునేందుకు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కోసిన వరి పంటను కాపాడుకునేందుకు పొలం, కళ్లాల్లో కుప్పలు వేస్తున్నారు. కళ్లాల్లోని ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పుతున్నారు.

బొబ్బిలి.. పొలంలో కుప్పలు వేస్తున్న రైతులు



ముక్కాం తీరంలో ఒడ్డుకు చేర్చిన బోట్లు

వంగర.. కోత కోసి పొలాల్లో ఉన్న వరిచేను

ప్రజాశక్తి-బొబ్బిలి, వంగర

ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి. అందుకనుగుణంగానే బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం, దత్తిరాజేరు, వంగర, డెంకాడ, తదితర మండలాల్లోనే శుక్రవారం సాయంత్రం నుంచే చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. పంట పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఖరీఫ్ వరి పంట పూర్తి స్థాయిలో కోత దశకు రావడంతో జిల్లాలో బొబ్బిలి, రాజాం, శృంగవరపుకోట నియోజకవర్గాల పరిధిలో పలు గ్రామాల్లో ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. కోసి ఉంచిన పంట సగానికి పైగా పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసేసిన వరిచేను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. తుపాను భయంతో కొంతమంది రైతులు కోసేసిన వరి పంటను కళ్లాలకు తరలించి కుప్పలు వేశారు. అవకాశం లేక మరి కొంతమంది రైతులు పంట పొలాల్లోనే కుప్పలు వేసి పంటను కాపాడుకుంటున్నారు.

వంగర మండలంలోని రుషింగి, రాజులగుమ్మడ, వివిఆర్ పేట, కింజంగి, మరువాడ, అరసాడ తదితర గ్రామాల్లో రైతులు వరి పంటను కోత కోసి, పొలాల్లో ఓవులుగా వేశారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి తేలికపాటి వర్షం కురుస్తుండటంతో పొలాల్లో కుప్పలు వేసిన పంట తడిసిపోతే నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీవర్షాలు కురిస్తే కోత దశలో ఉన్న మిగతా వరిచేను పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న రైతులను కలవరపెడుతోంది. కోయకుండా ఉన్న పంట నేలకొరిగితే పంటకు నష్టం అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటకు నష్టం వాటిల్లితే చేసిన అప్పులు ఎలా తీరుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కళ్లాల్లోనే ధాన్యం

జిల్లాలో ఇప్పటికే కోతలు పూర్తయిన చోట రైతులు నూర్పిడి చేశారు. నూర్పిడి పూర్తి చేసిన ధాన్యాన్ని కళ్లాల్లో నిల్వ చేశారు. కానీ వర్షాలకు ధాన్యం తడిసిపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం వరకు జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ఇప్పుడిప్పుడు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కళ్లాల్లో ధాన్యం ఉన్న రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

రైతులకు సూచనలు

తుపాను నేపథ్యంలో వరికోతలు వాయిదా వేయాలని, కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. జిల్లాలోని మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి మండలాల్లో పర్యటించిన ఆయన.. వ్యవసాయాధికారులకు సూచనలు చేశారు. రైతులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

తీరప్రాంత గ్రామాల్లో
తుపాను అలజడి

ప్రజాశక్తి-భోగాపురం

తీర ప్రాంత గ్రామాల్లో తుపాను అలజడి మొదలైంది. దీంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తుపాను ప్రభావంతో సముద్రంలో అల్లకల్లోలంగా మారింది. దీంతో తీరానికి అనుకుని ఉన్న బోట్లను, వలలను ఒడ్డుకు చేర్చారు. తుపాను హెచ్చరికలతో వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు అధికారులు సూచించారు. మరోవైపు రైతులు కోసిన వరిచేనును గాలిదిబ్బలు వేసుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తుపాను సమాచారాన్ని రైతులకు చేరవేస్తున్నారు.

భోగాపురం.. తుపాను భయంతో పొలాల్లోనే కుప్పలు పెట్టిన రైతులు

48 గంటల్లోనే ధాన్యం డబ్బులు

జెసి సేతు మాధవన్ • గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో పర్యటన

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

రైతులకు 48 గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ట్రక్ షీట్ జనరేట్ చేసిన వెంటనే ఎఫ్‌టిఒలను జనరేట్ చేస్తే 48 గంటల్లో రైతులకు నగదు జమవుతుందని చెప్పారు. శుక్రవారం గరివిడి, చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో జెసి పర్యటించారు. ధాన్యం కొనుగోళ్లను తనిఖీ చేశారు. గరివిడిలో అక్రాలెడ్జిమెంట్ ఉండే మిల్లులను, చీపురుపల్లిలో బఫర్ గోడౌన్‌ను, మెరకముడిదాంలో రైస్ మిల్లులను, రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఫీల్డ్ స్టాఫ్, కస్టోడియన్ అధికారులు బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. తుపాను దృష్ట్యా పెట్టుకొని నూర్పిన ధాన్యాన్ని రైతులు సురక్షితంగా ఉంచాలని తెలిపారు. తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జెసితో చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, ఆయా మండల తహశీల్దార్లు, సిఎస్ డిటిలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న జెసి సేతు మాధవన్

విమానాశ్రయం లోపల
నేవీకి 10 ఎకరాల భూమి కేటాయింపు

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయం లోపల నేవీకి పది ఎకరాల భూమిని కేటాయించడంతో ఆ భూములను నేవీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు చెందిన కొంతమంది నేవీ అధికారులు ఈ భూముల వ్యవహారంపై జిఎంఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. సముద్ర తీరానికి దగ్గరలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా సరే నేవీకి తప్పనిసరిగా భూములు కేటాయించాల్సి ఉంటుంది. ఆ భూముల్లో గస్తీకి సంబంధించిన భవనాన్ని నిర్మించనున్నారు. సముద్రం నుంచి చొరబాటుదారులు రాకుండా ఉండేందుకు విమానాశ్రయం లోపల నుంచి గస్తీని నిర్వహించనున్నారు.

విమానాశ్రయం లోపల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ టవర్ సమీపంలో ఈ భూములను కేటాయించినట్లు చెబుతున్నారు. భూములకు సంబంధించిన వివరాలను జిఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు, ఆర్‌డిఒ దాట్ల కీర్తి తెలియజేశారు. తహశీల్దార్ ఎం.సురేష్, ఆర్ఐ ఇమ్రాన్, విఆర్ఒ నారాయణస్వామి నాయుడు పాల్గొన్నారు.

విమానాశ్రయ భూమికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న నేవీ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు

మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20 లక్షల మేరకు కేటాయిస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో 47 అంశాలకు ఆమోదం లభించింది. వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. ప్రజలకు మంచి పాలన అందించడమే అందరి ధ్యేయమని పునరుద్ఘాటించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నగర అభివృద్ధి సాధ్యమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరంలోని 50 డివిజన్లకు రూ.20 లక్షల చొప్పున అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రాధాన్యత క్రమంలో ఆయా నిధులతో పనులు చేపట్టే వెసులుబాటు ఉందన్నారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం వద్ద
ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులకు ఆహారం వండి పెడుతున్న ఎండిఎం కార్మికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ప్రమాదాలు జరిగిన సందర్భంలో విద్యా శాఖ అధికారులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదన్నారు. అందుకు గురువారం కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన సంఘటనే నిదర్శనమన్నారు. వంట చేస్తుండగా అగ్నిప్రమాదం సంభవించి ఇద్దరికి కాలిన గాయాలైనట్లు చెప్పారు. కార్మికురాలు స్వప్నకు ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడినట్లు ఆందోళన వ్యక్తంచేశారు. అయినా ఇప్పటివరకు ఆమెను పరామర్శ కోసం కూడా పాఠశాల సిబ్బంది గానీ, విద్యా శాఖ అధికారులు గానీ వెళ్లలేదని చెప్పారు. వెంటనే స్వప్నకు నష్టపరిహారం చెల్లించాలని, ఆమె పూర్తిగా కోలుకునే వరకూ ఆర్థిక సాయం అందించాలని డిమాండ్‌చేశారు. ఎండిఎం కార్మికులకు ప్రమాద బీమా, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఏడాదికి మూడు కాటన్ దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటి డిఇఒకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు, మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు లక్ష్మి, సాయి, నారాయణమ్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులకు
క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భవన నిర్మాణ అనుమతులకు క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరిగా చేపట్టాలని ప్రణాళిక అధికారులు, సిబ్బందిని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించే నిమిత్తం ప్రణాళిక అధికారులు ఆయా భవన నిర్మాణ ప్రాంతాలకు వెళ్లి వివరాలను సేకరించారు. ఫూల్‌బాగ్ ప్రాంతంలో అసిస్టెంట్ సిటీప్లానర్ హరిబాబు, ప్రణాళిక సిబ్బందితో వెళ్లి అక్కడ భవన నిర్మాణ అనుమతులపై వచ్చిన దరఖాస్తును, వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. హద్దులు, ఇతర అంశాలను గమనించారు. హనుమాన్‌నగర్‌లో అనుమతి లేకుండా పైఅంతస్తు నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది అడ్డుకున్నారు. గోడల వరకు చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారు. ఎంజి రోడ్డులో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్న భవనానికి వేసిన సెంట్రింగ్ పనులను సిబ్బంది అడ్డుకుని, తొలగించి వేశారు.

ఉత్సాహంగా పోలీసు స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక జిల్లా పోలీసు మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోలీసు స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా సాగుతోంది. రెండో రోజు శుక్రవారం విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్లు, ఎఆర్, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డు విభాగాలకు చెందిన పోలీసు జట్లు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నాయి. పోలీసు అధికారులు, సిబ్బంది తమ హోదాలతో తారతమ్యం లేకుండా ఎంతో ఉత్సాహంగా వివిధ పోటీల్లో పాల్గొని, క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. కబడ్డీ, బాస్కెట్ బాల్, వాలీ బాల్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, స్లో సైకిల్ రేస్, లెమెన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్‌తోపాటు అథ్లెటిక్స్‌లో 100, 400, 800 మీటర్ల పరుగు, రిలే పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రో పోటీలను మహిళా, పురుషులకు వేర్వేరుగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రీడలు శనివారంతో ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఆర్ఐలు ఎస్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, శ్రీనివాసరావు, సిఐ లక్ష్మణరావు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న పోలీసులు

పనుల్లో నాణ్యత పాటించాల్సిందే

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందేనని కమిషనర్ నల్లనయ్య స్పష్టంచేశారు. నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. నూతనంగా సిసి కాలువలు, రోడ్లు, కల్వర్టులు, పైపులైను పనులు నిర్మించిన ప్రాంతాలకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను తనిఖీచేశారు. పనులు పూర్తి పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో అభివృద్ధి పనులను తామే స్వయంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. చేపట్టిన అభివృద్ధి పనుల్లో కచ్చితంగా పారదర్శకత ఉంటే, పది కాలాల పాటు నిర్మాణాలు పటిష్టంగా ఉంటాయని అభిప్రాయ పడ్డారు. నగరం అభివృద్ధి దిశగా పయనించాలంటే ప్రజా సహకారం కూడా అవసరమని స్థానికులతో చెప్పారు. వీధులలో చెత్తా చెదారాలు వేయరాదని, తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి, ప్రతి ఇంటికి వచ్చే చెత్త వాహనానికి అందివ్వాలని సూచించారు.

డిబిసిడబ్ల్యుఒగా అనిత

ప్రజాశక్తి-విజయనగరం

డిబిసిడబ్ల్యుఒగా ఎస్‌డి అనిత నియమితులయ్యారు. గతంలో జిల్లాలో డిఆర్ఒగా ఆమె పనిచేశారు. ప్రభుత్వం ఆమెను బదిలీచేస్తూ పోస్టింగ్ ఇవ్వకుండా జిఎడికి రిపోర్టు చేసింది. అప్పటి నుంచి ఆమె వెయిటింగ్‌లో ఉన్నారు. శుక్రవారం జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో ఆమెను జిల్లా బిసి సంక్షేమ, సాధికారత అధికారిగా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

నెరవేరనున్న చిరకాల వాంఛ

పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు పాశి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు శివారు గ్రామాలవి. సుమారు అర కిలోమీటరు దూరంలో ఉన్న ఆ రెండు గ్రామాలను కలిపే రోడ్డు కోసం దశాబ్దాలుగా అక్కడి ప్రజలు ఎదురు చూస్తున్నారు. పల్లెపండగ కార్యక్రమంతో ఆ గ్రామస్తుల కల నెరవేరబోతోంది. ఇప్పటికే పనులు కూడా ప్రారంభమయ్యాయి.

విజయనగరం రూరల్ మండల పరిధిలో శివారు గ్రామం బడుకొండపేట. ఈ గ్రామానికి సమీపంలో విశాఖపట్నం జిల్లా పరిధిలోని యాతపేట (కొత్తూరు) ఉంది. దశాబ్దాల నుంచి ఈ రెండు గ్రామాల ప్రజలు నిత్యం కాలిబాట ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి రోడ్డు సౌకర్యం వారికి కలగానే మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెపండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో ఈ రెండు గ్రామాల చిరకాల వాంఛ నెరవేరుతోంది. సుమారు 550 మీటర్ల పొడవైన సిసి రోడ్డు మంజూరైంది. సిసి రోడ్డుకు ఇరువైపులా కాలువలు కూడా నిర్మించనున్నారు. ఉపాధి హామీ నిధులు మంజూరు కావడంతో టిడిపి నాయకులు పాశి అప్పలనాయుడు ఆధ్వర్యాన పనులు ప్రారంభించారు. మూడు రోజుల నుంచి పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

రూ.83 లక్షలతో అభివృద్ధి పనులు

బడుకొండపేట పంచాయతీలో సుమారు రూ.83 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. బడుకొండపేట నుంచి యాతపేట వరకు సిసి రోడ్డు, కాలువలు, గ్రామం నుంచి నరసరాజు చెరువుకు సిసి రోడ్డు, రామజోగిపేట ప్రాథమిక పాఠశాల నుంచి వాటర్ సోర్స్ పాయింట్ వరకు సిసి రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ పనులన్నీ త్వరగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామని టిడిపి నాయకులు పాశి అప్పలనాయుడు తెలిపారు.

నేడు జిల్లా సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని జిల్లా అభివృద్ధిపై చర్చిస్తారని వివరించారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించి, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

29వ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు శుక్రవారం బయల్దేరారు. శని, ఆదివారాల్లో అమరావతి వద్దనున్న మందడాంలో ఈ పోటీలు జరగనున్నాయి. జిల్లా నుంచి 13 మంది పాల్గొననున్నారు. ఈ టీమ్‌కు కోచ్‌గా గణేష్ వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్ రాజు, సెపక్ తక్రా కార్యదర్శి ఎం.టి రాజేష్, సురేంద్ర యాదవ్ అభినందించారు. పతకాలతో జిల్లాకు తిరిగి రావాలని అభిలషించారు.

యశస్విని అభినందిస్తున్న వెల్పూరి శ్రీనివాసరావు, తదితరులు

తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి-విజయనగరం

తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని సౌత్ ఇండియా కాపు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెల్పూరి శ్రీనివాసరావు అభినందించారు. ఈ మేరకు విజయనగరంలోని యశస్విని ఆమె నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తూర్పుకాపు సామాజిక తరగతి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వబ్బిన సన్యాసినాయుడు, జనసేన ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, నాయకులు చంటి, సురేష్ రాజు, చిన్ని, మల్లువలస శ్రీను, పులిబంటి సంతోష్ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నాయీబ్రాహ్మణుల సమస్యలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సాలూరులో మంత్రి గుమ్మడి సంధ్యారాణిని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అరకు పార్లమెంట్ కన్వీనర్ డి.శ్రీనివాసరావు, మన్యం జిల్లా అధ్యక్షులు శంకర్రావు, విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షులు సింహాచలం, రవణ, కొయ్యల శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రైస్‌మిల్లులో ఆర్‌డిఒ తనిఖీ

ప్రజాశక్తి- తెర్లాం

స్థానిక రైస్ మిల్లును ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు రైతుల నుంచి ఎంత మేరకు ధాన్యం సేకరించారు. ఇంకా సేకరించవలసిన టార్గెట్ ఎంత అని యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం అన్‌లోడ్ చేసి రైతులను వెంటనే పంపించాలని సూచించారు. వాతావరణం సరిగా లేని కారణంగా రైతులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్‌ఐ కృష్ణమూర్తినాయుడు, విఆర్‌ఒ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

బడ్జెట్ ఆమోదం

డెంకాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసు దేవరావు అధ్యక్షతన శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2024 – 25 సవరణ బడ్జెట్ 2025 – 26 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సందర్భంగా సవరణ బడ్జెట్‌ను అంచనా బడ్జెట్‌ను మండల సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్ చదివి వినిపించగా సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.భవాని, పలువురు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని గుడివాడ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. జగదీశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు తరగతి గదులు, టాయిలెట్స్, వంటగది, పాఠశాల ప్రార్థన నిర్వహణ, ప్రార్థనలో జికె, నీతి పద్యాలు, తెలుగు నెలలు, తిథులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం, అంకెలు సంఖ్యలు, టేబుల్స్, చతుర్విధ ప్రక్రియలు చేయించారు. వర్క్ బుక్స్, ప్రోగ్రెస్ కార్డ్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.రమేష్, కె.నవీన్, సిఆర్‌పి కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలివ్వాలి

విజయనగరం: వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు లేక అవస్థలు పడుతున్నారని వయస్సు నిర్ధారణ పత్రాలిచ్చి పింఛను ఇవ్వాలని పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ శీరపు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శాంతకుమారి

పౌష్టికాహారం తీసుకోవాలి

కొత్తవలస: గర్భిణులు, బాలింతులు, పిల్లలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ పీడీ బి. శాంతకుమారి అన్నారు. మండలంలోని వియ్యంపేట సెక్టారు పరిధిలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పిల్లల ఎత్తు, బరువు పరిశీలించాలన్నారు. ప్రతి రోజూ గుడ్డు ఇవ్వాలని చెప్పారు. ఈ సమావేశంలో పిఒ ఉమాదేవి, లక్ష్మీ, సూపర్‌వైజర్లు రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

వేపాడ: ఈ నెల 28 నుంచి 30 వరకూ పెదవేగిలో జరుగుతున్న జోనల్ లెవల్ గేమ్స్‌లో స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఆరుగురు విద్యార్థినులు అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. 400 మీటర్ల పరుగు పందెంలో విజయం సాధించిన సౌమ్యని జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఉషారాణి అభినందించారు. క్రీడాకారిణిలకు శిక్షణ ఇచ్చిన పిఇటి అరుణ, పీడీ సంతోషి కుమారిలను ప్రిన్సిపాల్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, టీచింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు.

వేపాడలో తల్లిదండ్రుల సమావేశం

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిల్లల చదువు, వారి క్రీడలు, సౌకర్యాలపై చర్చించారు. సమావేశంలో ఎంఇఒలు జి. జగదీశ్వర్ రావు, పి.బాల భాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

తీరంలో భారీ తాబేళ్ల కళేబరాలు

భోగాపురం: మండలంలోని తీరప్రాంత గ్రామమైన ముక్కాం తీరానికి రెండు భారీ తాబేళ్ళ కళేబరాలు కొట్టుకొచ్చాయి. ఈ కళేబరాలను తీరంలో కుక్కలు పీక్కు తింటున్నాయి. సుమారు రెండు రోజులు కిందట తీరానికి కొట్టుకొచ్చినట్లు మత్స్యకార్లు చెబుతున్నారు. దీనిపై మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందినీని వివరణ కోరగా మేకనైజ్‌డ్ బోట్లు వల్ల ప్రమాదాల బారిన పడి మృతి చెంది ఉండవచ్చునని ఆమె తెలిపారు. తీరానికి కొట్టుకు వచ్చిన ఈ కళేబరాలను ఖననం చేయాలని పలువురు అంటున్నారు.

పనులను అడ్డుకున్న టిడిపి నాయకులు

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో జనసేన నాయకులు ప్రారంభించిన పల్లె పండుగ పనులను టిడిపి నాయకులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సరగడ తోగుల్ రెడ్డి, తుపాకుల గురుమూర్తి, రిక్క ఆదినారాయణ, తాటిపూడి ఉదయ్ కుమార్, బైరెడ్ల శ్రీను తమకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని అడ్డుకున్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

గజపతినగరం: 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు శుక్రవారం ప్రధానోపా ధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్ బహుమతులు ప్రధానం చేశారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రంథాలయం అభి వృద్ధి కమిటి ఏర్పాటు శుక్రవారం జరిగింది. మన గ్రంథాలయం –మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా కమిటీ ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, యువత అందరూ సమిష్టి నిర్ణయంతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా కడలి ప్రకాశరావు, గౌరవ సలహాదారులుగా సుంకర వాసుదేవరావు, అధ్యక్షులుగా పోలుబోతు రామా రావు, ఉపాధ్యక్షులుగా మద్దిల సత్యనా రాయణ, మాతా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పసుమర్తి వెంకటరమణ ట్రెజరర్స్‌గా జగ్గన్ని ధనుంజయ్, కొండపల్లి జయరాం, పోలుబోతు దుర్గాప్రసా దరావు, సభ్యులుగా పోలేటి గౌరీ, పోలుబోతు భాస్కరరావు, బెల్లాన వెంకటరావు, హరి మోహన్, బుగత లక్ష్మణరావు, మద్దిల సూరి బాబు, మద్దిల దుర్గ శేఖర్ బాబు, మద్దిల త్రినాధ్ శ్రీకృష్ణ, బుగత గంగాధర్, అవనాపు అప్పల రాజు, పోలుబోతు గణేష్ ఎన్నుకున్నారు. గ్రంథా లయ నిర్మాణం కోసం అందరూ సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి–చీపురుపల్లి

అంబేద్కర్ జీవిత చరిత్రను అన్ని పాఠశాలల్లో పాఠ్యాంశంగా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు గంటాన అప్పారావు పిలుపు ఇచ్చారు. పలు డిమాండ్లతో కూడిన లక్ష పోస్టు కార్డుల ఉద్యమం పోస్టర్స్‌ను శుక్రవారం విడుదల చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చీపురుపల్లిలో మధ్యాహ్న భోజనం విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలసి లక్ష కార్డుల ఉద్యమం పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రధాన డిమాండ్ లుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని, అంబేద్కర్ స్మృతి వనాలు, అధ్యయన కేంద్రాలు ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఏర్పాటు చేయాలని, అమరావతిని 1000 కోట్లతో అంబేద్కర్ బౌద్ధ క్షేత్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలలోను, ప్రభుత్వ కార్యాలయాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించాలని కోరారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ జాతీయ అవార్డును ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రేగాన చిట్టిబాబు, మామిడి శ్రీనివాసరావు, మిరియాల కృష్ణారావు, ఈశ్వరరావు, మురళి, నాగరాజు, జగదీశ్వరరావు, లక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే... రోగాలు రావా?

● మురికి కూపంగా ధర్మవరం ● శానిటేషన్ డ్రైవ్‌లోనూ పట్టని వైనం ● అనారోగ్యం బారిన ప్రజలు ● చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గుర్ల ఘటన మరల పునరావృతం కాకుండా ఉండేందుకు పల్లె పల్లెల్లోనూ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చి ప్రతి గ్రామానికి పారిశుధ్య పనులు నిర్వహణకు ఒక ఇంఛార్జిని నియమించినప్పటికీ ధర్మవరం మేజర్ పంచాయతీ వీధులలో, మురుగు కాలువలలో, చెత్త, వ్యర్థాలు పేరుకుపోయింది. వాడుకనీరు వెళ్లేందుకు అవకాశం లేక మురుగునీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తు గ్రామం దుర్గంధ భరితంగా తయారై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మండలంలోని రెండు మేజర్ పంచాయతీలు ఉండగా అందులో ఒకటి శృంగవరపుకోట కాగా రెండవది ధర్మవరం మేజర్ పంచాయతీ. ఈ పంచాయతీలో ఎక్కడా స్వచ్ఛత కానరావడం లేదు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య విభాగం అధికారులు, సచివాలయ సానిటరీ కార్యదర్శిలు కనీసం దృష్టి సారించడం లేదని స్థానిక ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ధర్మవరం కొత్తవీధిలో పేరుకుపోయిన చెత్త

మరణాలు సంభవిస్తే తప్ప అధికారులు ఈ గ్రామం వైపు చూడరా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పారిశుధ్య సిబ్బందిని అదనంగా కేటాయించాలని ఎప్పటికప్పుడు పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శానిటేషన్ డ్రైవ్‌లోనూ పారిశుధ్యాన్ని తొలగించలేదు

మా గ్రామంలో ఏళ్ల తరబడి మురుగు కాలువలు చెత్త చెదారాలు నిండి ఉన్న ఎవ్వరికీ పట్టడం లేదు. ఇటీవల నిర్వహించిన సానిటేషన్ డ్రైవ్‌లోనూ గ్రామాన్ని పూర్తిగా శుభ్రపరచలేదు. గ్రామం గుండా పోయే అధికారులకు కనబడే విధంగా బజార్ సెంటర్లో మాత్రమే పారిశుధ్య పనులు నిర్వహించారు. జిల్లాలో పారిశుధ్య లోపం వల్ల జరుగుతున్న అనారోగ్య అనర్థాలపై ప్రతిరోజూ పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి.

అల్లు సన్యాసిరావు ధర్మవరం గ్రామం.

ధర్మవరం మేజర్ పంచాయతీకి 6 మంది పారిశుధ్య కార్మికులు మాత్రమే ఉన్నారు. దీని వల్ల గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. ఇటీవల నిర్వహించిన సానిటేషన్ డ్రైవ్‌లో రోజుకు ఏడు మంది చొప్పున 10 రోజులు గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టారు. మురుగు కాలువలు శుభ్రపరిచి చెత్తను తొలగించి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాం. అయినప్పటికీ గ్రామంలో అక్కడక్కడ పారిశుధ్య లోపం కనిపిస్తుంది. త్వరలో గ్రామంలో పూర్తిగా పారిశుధ్యం తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

చంద్రశేఖర్, ఇఒ, ధర్మవరం మేజర్ పంచాయతీ

ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

మెప్మా బజార్ సందర్శన

ప్రజాశక్తి – నెల్లిమర్ల

నగర పంచాయతీలోని స్థానిక రామతీర్థం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్న మెప్మా బజార్‌ను మెప్మా పీడీ జి.వి. చిట్టిరాజు, నగర పంచాయతీ కమిషనరు కె.అప్పలరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉత్పత్తులు అమ్మకాలు పట్ల వార్డులోని ప్రజలందరికీ అవగాహన కల్పించి మెప్మా ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని సిఎంఎం డి.గోవింద రావు, సిఒలు ఆర్‌పిలకు సూచించారు.

అర్హుల జాబితా నిర్ధారించాలి

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బొద్దాం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 105/2లో 16 మంది లబ్ధిదారులకు సర్పంచ్ ఎర్ర రామసత్యవతి, మాజీ ఎంపిటిసి జనపురెడ్డి ఈశ్వరరావు, గ్రామ టిడిపి పెద్ద ఎర్ర సన్యాసిరావులకు తెలియకుండా ఏ విధంగా ఇళ్ల స్థలాలు అప్పగిస్తారని ఎర్ర సన్యాసిరావు, జనపురెడ్డి ఈశ్వరరావులు శుక్రవారం తహశీల్దార్ జె.రాములమ్మకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సమక్షంలో అర్హులను ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు విధులు నిర్వహించవలసి వస్తుందని, తాను మాత్రం ఇంటి స్థలాలను ఏ ఒక్కరికీ అప్పగించలేదని చెప్పారు. మీరు కోరిన విధంగా స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమక్షంలో లబ్ధిదారుల్లో ఎవరు అర్హులు ఎవరు అనర్హులు గుర్తించి అర్హులైన వారి జాబితాను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. కొన్ని పత్రికల్లో తాను స్థలాలు అప్పగించినట్లు వచ్చిన వార్తలు వాస్తవం లేదని ఆమె తెలిపారు.

'పల్లె పండగ'కు మీనమేషాలు

● ఇప్పటికీ రెండు గ్రామాల్లోనే పనులు ప్రారంభం

ప్రజాశక్తి – వేపాడ

మండలంలో 18 గ్రామ సచివాలయాల పరిధిలో గల పంచాయతీలకు స్థానిక ఎమ్మెల్యే లలిత కుమారి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలకు గ్రామ జనాభా ప్రాతిపదికన ఒక్కో గ్రామానికి 10 లక్షలు విలువ చేసే పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు గ్రామాలలో ఉన్న టిడిపి రెండు గ్రూపులకు ఒక్కొక్క గ్రూపునకు రూ.5 లక్షలు చొప్పున సర్దుబాటు చేశారు. అధికారంలో లేనప్పుడు టిడిపి నష్టాలు, కష్టాలు ఎదుర్కొని గ్రామస్థాయిలో మొదటి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న పార్టీ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు ప్రతి గ్రామంలోనూ అధిష్టానం ఆదేశాలు మేరకు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కమిటీ సభ్యులను నియమించారు. పార్టీ అధ్యక్షునికి ధీటుగా రెండో గ్రూపును స్థానిక ఎమ్మెల్యే ఏర్పాటు చేశారు. విజయం సాధించిన తరువాత ఎమ్మెల్యే మొదటి నుంచి టిడిపికి సేవలు అందించిన వారికి ఎన్నికల ముందు వైసిపి నుంచి టిడిపికి వచ్చిన వారిని రెండు గ్రూపులుగా విడదీసి నిధులు మంజూరు చేశారు. వైసిపి నుంచి టిడిపిలోకి వచ్చిన

పాటూరు ఎస్‌సి కాలనీలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

వారు గతంలో చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో ఈ సారి పనులు చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. టిడిపికి చెందిన పాటూరు సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి, వీలుపర్తి సర్పంచ్ సేనాపతి లీలలు మాత్రమే పల్లె పండగలో మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టారు. కాగా గ్రామాల్లో టిడిపిలోనే రెండు గ్రూపులు కాకుండా అందరినీ ఒకేచోట కూర్చోబెట్టి ఒకేతాటిపైకి తీసుకొచ్చి నిధులు మంజూరు చేస్తే పనులు చేసేందుకు ఎటువంటి ఇబ్బందీ లేకపోయేదని కొంత మంది నొచ్చుకుంటున్నారు.

వైసిపి సర్పంచులు ఉన్న గ్రామాల్లో మరో ఇబ్బంది

వైసిపి సర్పంచులు ఉన్న గ్రామాల్లో పనులు చేసేందుకు టిడిపి నాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ పని చేసిన తరువాత నగదు సర్పంచ్ ఖాతాలోకి వెళితే తమ పరిస్థితి ఏంటని మీమాంసలో ఉన్నారు. సర్పంచ్ ఖాతాకు వెళ్లకుండా నేరుగా పని చేసే టిడిపి నాయకుని ఖాతాకు వెళితే తాము పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మరికొంత మంది చెబుతున్నారు. ఇకపోతే ఒక వర్గానికి పంచాయతీరాజ్ జెఇ ఆలీ ప్రతిపాదనలు పంపారని మరో వర్గానికి చెందిన పనులను పంపించలేదని కొంతమంది వాపోతున్నారు. వివిధ గ్రామాల నుంచి రెండో వర్గం నుంచి వచ్చిన ఆరోపణలపై జెఇని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

పాత ఇళ్లకు కొత్త బిల్లులు

ప్రజాశక్తి- సంతకవిటి

గృహ నిర్మాణాల్లో అవకతవకలు

గత వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెప్పేట్టిన నవరత్నాలు..పేదలందరికి ఇళ్ళు కార్యక్రమంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి. జగనన్న ఇల్లు నిర్మాణ పనుల్లో అధికారులు, సిబ్బంది హాడావుడి చేసినా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు పూర్తికాలేదు. కాగా జగనన్న ఇంటి నిర్మాణాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలోని తాలాడ గ్రామంలో జగనన్న ఇళ్ళ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు. పాత ఇల్లుకు కొత్త బిల్లు లిచ్చి అవినీతికి పాల్పడ్డారని చెబుతున్నారు. ఇక బిల్లులు చెల్లింపు యాప్ పరిశీలిస్తే చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. ఈ అవకతవకలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరీష, ఎంపిటిసి కనకల సన్యాసినాయుడు, సర్పంచ్ వడ్డి గౌరి, ఉపసర్పంచ్ భవర సత్తి ప్రధాన కారణమని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఇళ్ళు నిర్మాణలను కనీసం తనిఖీ చెయ్యలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.10వేలు లంచం ఇస్తేనే బిల్లు

కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టకపోయినా పాత ఇళ్లు ఉండి కొత్త బిల్లు చేయాలంటే రూ.10వేలు ఇస్తే చేసేస్తానని ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పెద్ద ఎత్తున కలెక్షన్ చేయించారు. ఇక గ్రామంలో చాలా మందికి ఇలానే బిల్లులు చేయించారు. జగనన్న కాలనీలో ఇళ్ళు నిర్మాణం కోసం పొజిషన్ చేయకుండా బిల్లు చేసి ఇంటికి కావాలిసిన మెటీరియల్ కూడా వచ్చే విధంగా చేసేశారు. కానీ కాలనీలో మాత్రం ఇళ్ళు నిర్మాణాలు జరగలేదు. క్షేత్ర స్థాయిలో ఇంటి నిర్మాణం జరగకపోయినా జరిగినట్లు, బిల్లులు, సామగ్రి మంజూరు చేసి సచివాలయ సిబ్బంది, నాయకులు దోచుకున్నారు. తక్షణమే జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులు స్పందించి విచారణ చేపట్టి ప్రజలను దోచుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పశువైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి- కొత్తవలస

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద శుక్రవారం గనిశెట్టి పాలెంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది పాడి రైతులకు సంబంధించిన 47 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 12 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపణీ చేశారు. లేగదూడ ప్రదర్శనలో 43 మంది పాడిరైతులు వారి వారి లేగ దూడలను తీసుకుని రాగా, అందులో ఆరోగ్యంగా ఉన్న లేగదూడలను గుర్తించి మొదటి, రెండు, మూడు బహుమతులను ఇచ్చి, పాల్గొన్న అందరు రైతులకు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం సంయుక్త సంచాలకులు మండలంలోని కొత్తవలస, మిందివలస, రామచంద్రాపురం, గనిశెట్టి పాలెం గ్రామాలలో జరుగుతున్న పశుగణన కార్యక్రమాన్ని బ్రూసెల్లా వాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జామి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ జామి కొండలరావు, టిడిపి నాయకులు సూరిబాబు, జిల్లా సంయుక్త సంచాలకులు, పశుసంవర్ధక శాఖ డాక్టర్ వైవి రమణ, జిలా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాధాకృష్ణ, కొత్తవలస సబ్ డివిజన్ సహాయ సంచాలకులు గంగాధర్, దెందేరు, లక్కవరపుకోట పశువైద్యులు డాక్టర్ ప్రదీప్ నాయుడు, డాక్టర్ గాయత్రి, మండలంలోని పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను అందిస్తున్న అధికారులు

ప్రయాణికులకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

ఆర్‌టిసి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళిమోహన్ అన్నారు. శుక్రవారం రాజాంలో రాజాం నుంచి బలిజిపేటకు వెళ్లే నూతన బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనుందన్నారు. దీని కోసం మహిళలు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా బస్సుల సంఖ్యను ప్రభుత్వం పెంచుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కనీసం ఒక్క బస్సునూ కొనుగోలు చేయలేదని, మరమ్మతులకు గురైన బస్సులతో సర్వీసులు నడిపి ప్రయాణికులకు అవస్థలకు గురి చేశారన్నారు. రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆర్‌టిసిను బలోపేతం చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.ప్రభాకర్, సెక్యూరిటీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రవీణ్ కుమార్, డిపో హెడ్ కానిస్టేబుల్ జి.రాంబాబు, టిడిపి నాయకులు గురువానా నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, అడపా శ్రీను, శాసపు రమేష్, బవిరి శ్రీను, జరజాణ నితిన్, జనసేన నాయకులు యూపీ రాజు, గెడ్డపు నీలకంతం, కూటమి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళి

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మండలంలోని బొద్దాం గ్రామం నుంచి కొఠారిపురం గ్రామం రోడ్డుకు సుమారు రూ. 80 లక్షలతో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి పనులకు, మౌలిక వసతుల, నియోజకవర్గంలో రూ.60 కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. ఈ మేరకు నియోజకవర్గంలో ఉన్న 121 పంచాయతీలలో గల కాలువలు, సిమెంట్ రోడ్ల పనులు శర వేగంగా జరుగుతు న్నాయన్నారు. రూ.4కోట్లతో గుంతల రోడ్లు పూడ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

మండలంలోని గార చీపురుపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించి కోకో నట్ మిషన్, ప్లాస్టిక్ బాయిలింగ్ మిషనను ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన జీవనాన్ని కల్పించేందుకు స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించిందన్నారు. ఈ మేరకు 4లక్షల విలువ చేసే కోకోనట్ మిషన్, 3.5 లక్షలు రూపాయలతో ప్లాస్టిక్‌ను నిలువరించే మిషన్, పాడైపోయిన కూరగాయలతో ఎరువులు తయారు చేసే మిషన్‌ను ఏర్పాటు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చేస్తున్నామన్నారు.

ఎంపిడిఒకు ఆహ్వాన పత్రికను ఇస్తున్న తులసి

అనుపోత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బాణాదిలో సోమవారం జరగనున్న గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవానికి తప్పనిసరిగా రావాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణను ఎంపిటిసి గొంప తులసి శుక్రవారం ఆహ్వానించారు. ఈ ఉత్సవంలో భాగంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. అనంతరం ఎంపిడిఒకు ఆహ్వాన పత్రాన్ని అందించారు.

నేరాలు ఘోరాలు

జూదగాళ్లతో శ్రమదానం

శిక్ష విధించిన ఎక్సైజ్ కోర్టు

ప్రజాశక్తి- డెంకాడ

పేకాటాడుతూ పట్టుబడిన ముద్దాయిలు కోర్టు ఆవరణలో, డెంకాడ పోలీసు స్టేషన్ ఆవరణలో ఐదు రోజులు పాటు శ్రమదానం చేయాలని ఎక్సైజ్ కోర్టు తీర్పు వెలువరించింది. డెంకాడ ఎస్ఐ ఏ సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 26న మండలంలోని డి.తాళ్లవలస సమీప తోటలో పేకాటాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేయగా 13 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.46,580, ఒక కారు, ఐదు మోటార్ సైకిల్, 15 సెల్ ఫోన్లు సీజ్ చేశాం. వీరిని అరెస్టు చేసి జిల్లా కోర్టులో హాజరుపరచగా ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం. శ్రీనివాసరావు ముద్దాయిలకు ఐదు రోజులపాటు జిల్లా కోర్టులో శ్రమదానం క్లీన్ అండ్ గ్రీన్ చేయాలని, ఒకరోజు డెంకాడ పోలీస్ స్టేషన్లో పరిసర ప్రాంతాల వద్ద శ్రమదానం చేయాలని శిక్ష విధించారు. దీంతో శుక్రవారం జిల్లా కోర్టులో పరిసర ప్రాంతాల వద్ద కమ్యూనిటీ సర్వీస్ వర్క్ చేయించామని ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి–బొబ్బిలి

స్థానిక ఐటిఐ కాలనీ సమీపంలో ఉన్న ఉద్యానవన క్షేత్రంలో పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడ్డారు. ఉద్యానవన క్షేత్రంలో పేకాట అడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ రమేష్, తమ సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురుని అరెస్టు చేసి రూ.9090 నగదు సీజ్ చేశారు.

పాత నేరస్తుడు అరెస్టు

ప్రజాశక్తి- కొత్తవలస

గతేడాది డిసెంబరులో తుమికాపల్లి గేటు దగ్గర కిరాణా షాప్ వెనక అచ్చయ్య శెట్టి ఇంట్లో తలుపులు బద్దలు కొట్టి దొంగతనం చేసి సుమారు రెండు తులాల బంగారాన్ని అపహరించిన పాత నేరస్థుడును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా గుర్తించి నేరస్తుడైన తరుణ్ కుమార్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారు వస్తువులను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు అన్నారు. రామభద్రపురం మండలం కరెమ్మదొరవలస గ్రామ శివారులో సారా కోసం సిద్ధం చేసిన 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా నివారణకు సహకరించాలని ప్రజలను కోరారు. దాడిలో ఇఎస్‌టిఎఫ్ విజయనగరం ఎస్ఐ జి.గంగాధర్, సీతానగరం ఎక్సైజ్ ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలు చోరీ

ప్రజాశక్తి – పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారంలో శుక్రవారం పట్టపగలు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లోకి దూరి, బీరువా పగలగొట్టి తులం బంగారం కొంత నగదు అపహరించిపోయినట్లు బాధితులు తెలిపారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్టేలు జానకి గ్రామంలోని శివాలయం వద్ద జరుగుతున్న అన్నసమారాధనకు ఇంటికి తాళం వేసుకుని వెళ్లింది. ఆ సమయంలో ఇంటికి పెళ్లి కార్డు ఇవ్వడానికి బంధువులు వచ్చారు. ఇంట్లో నుంచి ఒక అపరిచితుడు బయటికి రావడం చూసిన బంధువులు జానకి ఎక్కడికి వెళ్ళిందనీ అడిగారు. శివాలయం వద్ద ప్రమాదం జరిగి ఆమె అక్కడ మృతి చెందిందని బంధువులకు చెప్పాడు. వెంటనే బంధువులు శివాలయం వద్దకు పరుగులు తీశారు. బంధువులు అటు వెళ్లి పోయిన తరువాత అక్కడి నుంచి అగంతకుడు బంగారం, డబ్బు అపహరించి పరారయ్యాడు. శివాలయం వద్ద ఎటువంటి ప్రమాదం జరగలేదని బంధువులు గుర్తించి మరల ఇంటికి వచ్చారు. ఇంతలో జానకి కూడా ఇంటికి వచ్చింది. ఇంటి తలుపులు తీసి ఉండటంతో జానకి అవాక్కయింది. తాము వచ్చేసరికి ఇంట్లో నుంచి ఎవరో ఒక ఆయన వచ్చి పల్సర్ బైక్‌పై వెళ్లిపోతున్నాడంటూ బంధువులు జానకికీ తెలిపారు. లోనికి వెళ్లేసరికి బీరువా పగలగొట్టి ఇంట్లో వస్తువులన్నీ చిందర వందరగా ఉన్నాయి. బీరువాలో ఉన్న సుమారుగా తులం బంగారం కనిపించడం లేదని, సుమారు రూ.5వేలు వరకు నగదు కనిపించడం లేదని ఆమె గగ్గోలు పెట్టింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. పోలీసులు సిసి కెమెరాలు పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, వ్యాన్ ఢీ ; ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గ్రోత్ సెంటర్ సమీపంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆటోను వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఏఎస్‌ఐ భాస్కరరావు వివరాలు మేరకు.. సాలూరు మండలం బంగారమ్మపేటకు చెందిన కొంతమంది శుక్రవారం ఆటోలో సీతానగరం మండలం పెదభోగిలి శుభ కార్యానికి వెళ్లారు. ఆటోలో పెదభోగిలి నుంచి బొబ్బిలి, కోటిచెరువు రోడ్డు మీదుగా గ్రోత్ సెంటర్ రోడ్డుకు వస్తుండగా ఐసిడిఎస్ కార్యాలయం సమీపంలో ఐసిడిఎస్ గోదాంకు వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ నల్ల రాజశేఖర్, ప్రయాణికురాలు నల్ల అనిత తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా ఉండడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏఎస్‌ఐ భాస్కరరావు కేసు నమోదు చేస్తున్నారు.

మహారాజశ్రీ IVth ఎడిషనల్ జిల్లా కోర్టు మరియు SC&ST కోర్టు శ్రీకాకుళం
AS 29/2022

Between:-
AP **గ్రామీణ విశాఖ బ్యాంక్ రాజాం** ......అపిలెంట్
And:-
లావణ్య స్వయం శక్తి సంఘం rep by its **ఆర్గనైజర్ మజ్జ లక్ష్మి** .....రెస్పాండెంట్స్

నోటీస్

To,
R-13: తాత సూర్యలత, W/o సాయి, బియ్యం వ్యాపారం, మెంబర్ లావణ్య స్వయం శక్తి సంఘం, సారధి గ్రామం, రాజాం మండలం, శ్రీకాకుళం జిల్లా ప్రస్తుతం విజయనగరం జిల్లా
R-14: చీమకుర్తి కృష్ణవేణి, W/o నరసింహమూర్తి, టైలరింగ్, --rest do--
R-15: సింహాద్రి సూరిబాబు S/o, Not known వ్యాపారము —Rest do —
R-16: సింహాద్రి సాయి, S/o సింహాద్రి సూరిబాబు, వ్యాపారము ----Rest do—

పైన పేర్కొన్న అపెలెంట్స్ పై కోర్టులో మీ వగైరాలపై మరియు లావణ్య స్వయం శక్తి సంఘం మిగతా సభ్యుల పైన పై నెంబరు ఆపిల్ను రాజాం సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఫైలు OS.67/2016 Dt 9-05-2022 డిక్రీ, జడ్జిమెంట్ పై దాఖలు చేసి ఉన్నందున మీకు ఎట్టి ఆక్షేపణలు ఉన్నయెడల మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని **తేదీ 02-12-2024 దీన ఉదయం 10-30 నిమిషాలుకు** పై కోర్టు లో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసి కొనవలెను లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది

రెడ్డి రామమూర్తి
రెడ్డి విజయ్ కుమార్
న్యాయవాదులు,
రాజాం, సెల్: 9440348431